ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- రేపల్లెవాడ, ప్రగడపల్లి గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం


రేపల్లెవాడలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

పోలవరం రూరల్: గ్రామాల్లో ప్రజా సమస్యలను తెలుసుకుని సత్వర పరిష్కారం కోసమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని రేపల్లెవాడ, ప్రగడపల్లి గ్రామాల్లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రతిగడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అందని వారు ఎవరైనా ఉంటే వారిచే వెంటనే దరఖాస్తు చేయించి వారికి పథకాలు అందేలా చూడాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచించారు. సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, హెల్త్ క్లీనిక్‌లు నూతన భవనాలను స్థానికంగా నిర్మించి ప్రజలకు సేవలు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. నాడు, నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. అలాగే పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంతో పాటు యూనీఫాం, పుస్తకాలు కూడా అందిస్తున్నామన్నారు. పాఠశాలలకు వెళ్లే ప్రతి విద్యార్థి తల్లుల ఖాతాలో అమ్మ ఒడి కింద సొమ్ము జమ చేయడం జరుగుతుందన్నారు. నవరత్నాల పథకాల్లో అర్హులైన వారికి పింఛన్‌లు, జగనన్న తోడు, జగనన్న కాలనీలు, జగనన్న విద్యాదీవెన వంటి అనేక పథకాలను అమలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ, ఎంపీటీసీ దాపర్తి మోహనరావు, సొసైటీ అధ్యక్షుడు పాదం రాజబాబు, బండారు అప్పారావు, ఏఎంసీ డైరెక్టర్ షేక్ ఫాతిమున్నీసా, వ్యవసాయ సలహామండలి చైర్మన్ దత్తి రాంబాబు, మండల సచివాలయ కన్వీనర్ మాదేపల్లి సాయికృష్ణ, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన జిల్లా సోషల్ మీడియా కన్వీనర్


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన చిక్కాల దుర్గాప్రసాద్, సజ్జల భార్గవ్

కొయ్యలగూడెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలోని సీఎం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నట్టు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్ తెలిపారు. సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ సజ్జల భార్గవ్‌రెడ్డితో కలిసి సీఎంని కలిసినట్టు చెప్పారు. వచ్చేది మన ప్రభుత్వమేనని, పార్టీలోని అందరికీ న్యాయం చేస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్టు తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2 లక్షల విరాళం


దాత సత్యకుమార్‌కు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు గురువారం రూ. 2,00,116 విరాళంగా అందజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన బాయిశెట్టి సత్యకుమార్ ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలోని సమాచార కేంద్రంలో ఈ విరాళాన్ని జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ప్రోటోకాల్ ఏఈఓ మిట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

డీఎస్పీకి అభినందనలు


డీఎస్పీ ధనుంజయుడుకి అభినందనలు తెలుపుతున్న మహిళలు

జంగారెడ్డిగూడెం : కేంద్ర హోంమంత్రి పరిశోధన ప్రతిభా పురస్కారం (సెంట్రల్ హోం శాఖ ఎక్సలెన్సీ అవార్డు)ను అందుకున్న డీఎస్పీ ధనుంజయుడికి పట్టణానికి చెందిన మహిళలు అభినందనలు తెలిపారు. గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ధనుంజయుడిని మహిళలు కలుసుకుని అభినందనలు తెలపడంతో పాటు, సత్కారం చేశారు. అలాగే మొక్కను అందించారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ అధ్యక్షురాలు అన్నపూర్ణ దేవి, వైఎస్సార్ సీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు నాగదేవి, మానవత జిల్లా కన్వీనర్ త్రిపుర రమేష్, మెప్మా ఆర్పీ నాగలక్ష్మి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

దోబీఘాట్ విద్యుత్ సమస్య పరిష్కరించాలి


విద్యుత్ ఈఈ రాధాకృష్ణకు సమస్యను వివరించిన రజక సంఘం నాయకులు

జంగారెడ్డిగూడెం : కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడు గ్రామంలోని రజకుల దోబీఘాట్ విద్యుత్ బిల్లు సమస్యను పరిష్కరించాలని ఉమ్మడి జిల్లా రజక జన సంఘ అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. ఈమేరకు జంగారెడ్డిగూడెం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాధాకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో రజక వృత్తిదారుల సంక్షేమం కోసం ప్రభుత్వం విడుదల చేసిన జీవో 75ను అమలు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఈఈ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రజక సంఘం నేతలు పాల్గొన్నారు.

ఉప్పలపాడు యువకుడికి డాక్టరేట్


పీహెచ్‌డీలో ఉత్తీర్ణత సాధించిన గోపీకృష్ణ

కామవరపుకోట : పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదని నిరూపించాడు ఉప్పలపాడు గ్రామానికి చెందిన పొడపాటి గోపీకృష్ణ. చిన్నతనంలోనే తల్లిదండ్రులు దూరమైనా, ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా పట్టుదలతో అమ్మమ్మ లింగాల సావిత్రి, దాతల ప్రోత్సాహంతో విద్యనభ్యసించారు. ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రీ విశ్వవిద్యాలయంలో భూవిజ్ఞాన విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న గోపీకృష్ణ బంగాళాఖాతంలో వచ్చే తుపానులపై చేసిన పరిశోధనకు గాను గురువారం వచ్చిన ఫలితాలలో డాక్టరేట్ సాధించారు. త్వరలో వర్సిటీలో జరిగే స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టా పొందనున్నారు. ఈ సందర్భంగా పలువురు గోపీకృష్ణకు అభినందనలు తెలిపారు.

డిగ్రీ ప్రవేశాలకు రెండో విడత షెడ్యూల్ విడుదల

ఏలూరు (టూటౌన్): ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో ప్రవేశాలు పొందేందుకు రెండో విడత కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదలైంది. ఆన్‌లైన్ విధానంలో ఈనెల 28 నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు తమ అభ్యర్థిత్వాన్ని నమోదు చేసుకోవాల్సిందిగా ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు పేర్కొన్నారు. కన్వీనర్ కోటాలో చేరిన విద్యార్థులకు మాత్రమే జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన ద్వారా స్కాలర్‌షిప్‌నకు అర్హత ఉంటుందని తెలిపారు. ఏలూరు, పరిసర ప్రాంతాల విద్యార్థులు తమ పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని గిరిబాబు సూచించారు.

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరవళ్లు


సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరవళ్లు తొక్కుతోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ద్వారకాతిరుమలలోని పోలీస్ స్టేషన్ వద్ద నుంచి, వసంతనగర్ కాలనీ వరకు లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్‌కు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పాలనను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక తమ ప్రభుత్వంపై బురద చిమ్మేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ముందెన్నడూ జరగని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని అన్నారు. నవరత్న పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని పేర్కొన్నారు. తమ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ నాయకులు యిమ్మడి నాగు, బొండాడ వెంకన్నబాబు, అచ్యుత ఏసుబాబు, మానుకొండ సుబ్బారావు, గుర్రాల లక్ష్మణ్, అన్సారి తదితరులున్నారు.

కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుంది


లక్ష్మణ్ కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

పోలవరం రూరల్: వైఎస్సార్ సీపీలో పనిచేసే ప్రతి ఒక్కరికి పార్టీ అండగా ఉంటుందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందిన పోలవరం మండలం సోషల్ మీడియా కోకన్వీనర్ అక్కాబత్తుల లక్ష్మణ్ కుటుంబానికి ఎమ్మెల్యే ప్రోత్సాహంతో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ సజ్జల భార్గవ రెడ్డి రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మొత్తాన్ని తాడేపల్లి కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా పోలవరం మండలం ప్రగడపల్లి గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లక్ష్మణ్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. పార్టీ కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని బాలరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, ఏలూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, జిల్లా మైనార్టీ సెల్ సెక్రటరీ ఎస్‌కే బాజీ, పోలవరం మండల సచివాలయ కన్వీనర్ మాదేపల్లి సాయిరామకృష్ణ, పాడుం శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుంకుళ్లమ్మ ఆలయం ముస్తాబు



కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేస్తున్న సిబ్బంది, ద్వారకాతిరుమల క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు →

ద్వారకాతిరుమల : వరలక్ష్మి వ్రత వేడుకలకు క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. రెండవ శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని గురువారం దేవస్థానం సిబ్బంది మామిడి తోరణాలు, అరటి బోదెలు, వేప ఆకులతో శోభాయమానంగా అలంకరించారు. అలాగే అమ్మవారిని శాకాంబరిగా అలంకరించేందుకు ఫల, కూరగాయలను సిద్ధం చేశారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారు ఫల, కూరగాయల అలంకరణలో శాకాంబరిగా దర్శనమిస్తారని, పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు కోరారు.

ఆక్రమణదారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి


బొర్రంపాలెం ఎస్సీ ఏరియాలో శ్మశానవాటికను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్ విశ్వనాథ్

టి.నరసాపురం : బొర్రంపాలెంలో శ్మశాన వాటికలో ఆక్రమణలు తొలగించి ఆక్రమణదారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా పంచాయతీ అధికారి టి.శ్రీనివాస్ విశ్వనాథ్ గురువారం ఆదేశించారు. బొర్రంపాలెం ఎస్సీ ఏరియాలో ఉన్న శ్మశాన వాటిక ఆక్రమణలకు గురైందని, వాటిని తొలగించాలని జోసెఫ్ తంబి స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు విషయమై బొర్రంపాలెం వచ్చిన జిల్లా పంచాయతీ అధికారి శ్మశాన వాటికను పరిశీలించారు. శ్మశాన స్థలంలో నలుగురైదుగురు చిన్న చిన్న పాకలు, గుడిసెలు వేసుకుని నివాసం ఉండటాన్ని గుర్తించారు. వారు నిరుపేదలు కావడంతో వారితో సామరస్యంగా మాట్లాడి వారికి జగనన్న కాలనీలో స్థలాలు, ఇళ్లు కేటాయించి ఆక్రమణలను ఖాళీ చేయించాలని స్థానిక అధికారులకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి కేఎస్ కృష్ణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వాడవాడలా చంద్రయాన్-3 సంబరాలు


జంగారెడ్డిగూడెం : బుట్టాయగూడెం రోడ్ ఎంపీపీ స్కూల్‌లో విజయోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


కొయ్యలగూడెం : బయ్యనగూడెంలో ఇస్రోకి అభినందనలు తెలుపుతున్న హైస్కూల్ విద్యార్థులు


బుట్టాయగూడెం : చంద్రయాన్ విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

జంగారెడ్డిగూడెం : చంద్రయాన్ - 3 విజయోత్సవ సంబరాలు గురువారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట పాఠశాలల విద్యార్థులు, పలు సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించి ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. పలు చోట్ల స్వీట్లు పంచిపెట్టారు. స్థానిక బుట్టాయగూడెం రోడ్ ఎంపీపీ స్కూల్‌లో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు జాతీయ జెండాను పట్టుకుని నినాదాలు చేశారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా విద్యనభ్యసించి మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలని, దేశానికి ఖ్యాతి తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పరిషత్ సభ్యులు కేవీఆర్ సత్యనారాయణ, బీకే విశ్వనాథ్, కొనకళ్ల వెంకటేశ్వరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

జంగారెడ్డిగూడెం పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో చంద్రయాన్-3 విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ కొప్పాక శ్రీనివాసరావు అధ్యక్షతన, సీనియర్ నాయకులు మల్లాది సీతారామారావు పర్యవేక్షణలో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలుపుతూ గంగానమ్మ గుడి సెంటర్లో పట్టణ ప్రధాన కూడళ్లలో మిఠాయిలు పంచిపెట్టారు.

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

నవ భారత శకానికి నాంది పలికిన ఇస్రో భారత శాస్త్రవేత్తలకు జంగారెడ్డిగూడెం పట్టణ వాకర్స్ అసోసియేషన్ అభినందనలు తెలిపింది. స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జయహో భారత్, జయహో ఇస్రో అంటూ నినాదాలు చేశారు. భవిష్యత్తులో ఇస్రో మరిన్ని మానవాళికి ఉపయోగపడే ప్రయోగాలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మండలంలోని రాజవరం, కొయ్యలగూడెం, కన్నాపురం, వేదాంతపురం, జిల్లా పరిషత్ హైస్కూళ్లతోపాటు సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం, ఎంవీఆర్ హైస్కూల్స్‌కు చెందిన విద్యార్థులు ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించారు. ఇస్రోకి అభినందనలు తెలుపుతూ ఫ్లెక్సీలతో శుభాకాంక్షలు తెలుపుతూ ప్రదర్శనలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు ర్యాలీ కార్యక్రమాలను ప్రారంభించారు.

బుట్టాయగూడెం : స్థానిక విద్యారోహిణి డిజిటల్ స్కూల్ విద్యార్థులు గురువారం బుట్టాయగూడెంలో ర్యాలీ నిర్వహించారు. జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు.

నేటినుంచి ఆరోగ్యశ్రీ వైద్య శిబిరాలు

బుట్టాయగూడెం : మండలంలో శుక్రవారం నుంచి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వద్ద ఆరోగ్యశ్రీ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆరోగ్యశ్రీ జిల్లా కోర్డినేటర్ రాజీవ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కోవిడ్ పరిస్థితుల దృష్ట్యా నిలిపివేసిన ఆరోగ్యశ్రీ వైద్య శిబిరాలు సీఈఓ ఆదేశాల మేరకు గిరిజన ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈనెల 25వ తేదీన బుట్టాయగూడెం మండలం దొరమామిడి, 26న జంగారెడ్డిగూడెం మండలం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ తాడువాయి, 29న జీలుగుమిల్లి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద, 30న వేలేరుపాడులో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇకపై ప్రతి నెలలో నాలుగు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలందిస్తామన్నారు.

రేపు సామాజిక తనిఖీ సభ

జంగారెడ్డిగూడెం రూరల్ : జంగారెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 26న ఉదయం 10 గంటలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ నివేదిక బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె. కిరణ్ కుమార్ తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిగిన పనులపై ఈ బహిరంగ సభ ఉంటుందన్నారు. రైతులు, ఉపాధి కూలీలు, సామాజిక కార్యకర్తలు, ఉపాధి హామీ, పంచాయతీ, వెలుగు సిబ్బంది పాల్గొనాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

టి.నరసాపురం : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని టి.నరసాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కల్పనా రాణి అన్నారు. గురువారం రుద్రకోటరాజుగూడెంలో డాక్టర్ ఆర్.ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ప్రతి శుక్రవారం డ్రైడే - ఫ్రైడే పాటించాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీరు నిల్వ ఉండకుండా చూడటం, కాచి చల్లార్చిన నీరు తాగడం చేయాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. వైద్యశిబిరంలో రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

కొబ్బరి మొక్కల తొలగింపుపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఓ రైతుకు చెందిన వ్యవసాయ భూమిలో కొబ్బరి మొక్కలను తరచూ తొలగిస్తుండటంపై రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అయ్యవారిపోలవరానికి చెందిన బండారు వెంకట సుబ్బారావు, మరికొందరు రైతులకు సంబంధించిన వ్యవసాయ భూములను కొంగువారిగూడెం ప్రాజెక్టు ముంపు నేపథ్యంలో ఇరిగేషన్ శాఖ సేకరించింది. సదరు భూములు ముంపునకు గురికాకపోవడంతో ఇరిగేషన్ శాఖను, హైకోర్టును రైతులు ఆశ్రయించగా సదరు భూముల్లో సాగు చేసుకునేందుకు ఉత్తర్వులు వచ్చాయి. దీంతో ఆ భూముల్లో రైతులు కొబ్బరి మొక్కలు వేసుకున్నారు. అయితే జూలై 7వ తేదీన సీపీఎంకు చెందిన పిట్ల సీత, మరో 10 మంది కలిసి ఆ మొక్కలు పీకివేశారు. మళ్లీ కొబ్బరి మొక్కలు వేయగా, జూలై 26న మరోసారి పీకివేశారు. ఈ ఘటనలో రూ.10 లక్షల వరకు నష్టం వచ్చిందని, సదరు భూముల్లో ప్రవేశిస్తే అంతుచూస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని, తమకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని రైతు బండారు వెంకట సుబ్బారావు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డిగ్రీ కళాశాలలో సాహిత్య సదస్సు

జంగారెడ్డిగూడెం : స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ కళాశాలలో గురువారం సాహిత్య సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్‌బాబు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా కేంద్రీయ విశ్వవిద్యాలయం, తెలుగు శాఖ ఆచార్యులు పరిమి రామ నరసింహం పాల్గొని మాట్లాడారు. భాష భావ వ్యక్తీకరణ అనే అంశం మీద పూర్వ భాష శాస్త్రవేత్తలు చేసిన కృషిని కొనియాడారు. గిడుగు రామ్మూర్తి తెలుగు వ్యవహారిక భాషకు చేసిన సేవను విద్యార్థులకు తెలియజేశారు. సదస్సును తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ జి.వెంకటలాల్ నిర్వహించగా, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

వార్డు సభ్యులకు ఎమ్మెల్యే అభినందనలు


వార్డు సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే ఎలీజా, వైఎస్సార్ సీపీ నేతలు

లింగపాలెం : ఉప ఎన్నికల్లో గెలుపొందిన లింగపాలెం మండలంలోని పంచాయతీ వార్డు మెంబర్లను చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అభినందించారు. పాశ్యానగరం, మఠంగూడెం గ్రామ పంచాయతీల వార్డు మెంబర్లుగా గెలుపొందిన పొన్నుబోయిన రమేష్, పిల్లి శాంతిలీలను గురువారం ఎమ్మెల్యే అభినందించారు. ఈమేరకు మండల నాయకులు ఎలీజాకు కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కలసి పనిచేసిన విజయం అని ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ కఠికినేని రఘుబాబు తదితరులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణ పనులపై తనిఖీ


అలివేరు రేపల్లె రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

బుట్టాయగూడెం : మండలంలోని మారుమూల గ్రామమైన అలివేరు నుంచి రేపల్లె వరకూ గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ ద్వారా చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను గురువారం గిరిజన సంక్షేమ శాఖ క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆ శాఖ ఈఈ ఏవీఎస్ మూర్తి మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించినట్లు చెప్పారు. అలివేరు నుంచి రేపల్లె వరకూ సుమారు 6 కిలోమీటర్ల వరకూ రూ.2 కోట్ల 50 లక్షలతో రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారన్నారు. అయితే ప్రస్తుతం అలివేరు నుంచి గానుగు మామిడి జంక్షన్ వరకూ 3.3 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు పూర్తయ్యాయని, ఈ పనులు సంతృప్తికరంగా ఉన్నాయని అన్నారు. రేపల్లె వరకూ రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాతే పూర్తి నివేదిక వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆ శాఖ డీఈ ఐ.శ్రీనివాస్, కేఆర్‌పురం గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ డీఈ జొనాతన్, ఏఈ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.